క్లుప్తంగా

రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

బొండపల్లి: జేష్ఠ బహుళ ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు దూసి శ్రీధర్ శర్మ భక్తుల గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

డిగ్రీలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

గజపతినగరం: ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. కళాశాలలో బీజెడ్‌సీ, ఎంపీసీ, బీఏ పొలిటికల్ సైన్స్, హిస్టరీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. నామమాత్రపు ఫీజుతో నాణ్యమైన విద్య బోధన అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 5వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ప్రవేశాలు కోరే విద్యార్థులు ఇంటర్మీడియట్ టీసీని తీసుకొని వచ్చినట్లయితే కళాశాలలోనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోతురాజు విగ్రహం ఏర్పాటు


అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన పోతురాజు విగ్రహం, షెడ్

వేపాడ: మండలంలోని ఓబలయ్యపాలెం గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో పోతురాజు విగ్రహాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన యల్లమాంబ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో విగ్రహానికి షెడ్ ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు, యువజన సంఘ సభ్యులు మంగళవారం షెడ్‌ను ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో పోతురాజు విగ్రహంతో పాటు షెడ్ ఏర్పాటు చేసిన యూత్ సభ్యులను గ్రామ పెద్దలు అభినందించారు.

మెగా జాబ్‌మేళాకు విద్యార్థుల సన్నద్ధం


మాట్లాడుతున్న వాగ్దేవి విద్యాసంస్థల కరస్పాండెంట్ మహేశ్వరరావు, తదితరులు

కొత్తవలస: మండల కేంద్రంలోని వాగ్దేవి విద్యా సంస్థల్లో మేజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మెగా జాబ్‌మేళా శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ మహేశ్వరరావు మాట్లాడుతూ.. త్వరలో కళాశాల ఆవరణలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో పదికి పైగా మల్టీనేషనల్ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఆయా కంపెనీల ప్రతినిధులు నిర్వహించే ఇంటర్వ్యూలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ఈ శిక్షణ కార్యక్రమం చేపట్టామన్నారు. వారం రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమానికి సుమారు 250 మంది విద్యార్థులు హాజరైనట్లు వాగ్దేవి విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్.ఇ.కుమార్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, మేజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్‌తో కూరగాయల ఖర్చు ఆదా


పాఠశాల కిచెన్ గార్డెన్‌లో విద్యార్థులతో కలిసి నారుమొక్కలు నాటుతున్న ఉపాధ్యాయుడు

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి(ఆర్ఎస్) ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కిచెన్ గార్డెన్ నిర్వహణపై హెచ్ఎం పి.రామచంద్రరావు మంగళవారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పాఠశాల ఆవరణలో పలు రకాల కాయగూర పంటలు సాగు చేయాలని నిర్ణయించారు. వంగ, మిరప, కొత్తిమీర, మిరప, తదితర పంటల నారుతో పాటు గోంగూర, బెండ, చిక్కుడు విత్తనాలను చిన్నారులతో నాటించారు. కిచెన్ గార్డెన్ ఉపయోగాన్ని విద్యార్థులకు వివరించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

వేపాడ: మండలంలో బానాది పంచాయతీలో సర్పంచ్ కర్రి యశోధ ఆధ్వర్యంలో వారం రోజులుగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. గ్రామంలోని మురుగు కాలువల్లో పూడికలు తొలగించడం, వాటర్ ట్యాంకు క్లీనింగ్, క్లోరినేషన్, రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ పౌడర్ వేయడం వంటి పనులు చేపట్టారు. ఇళ్లలోని వ్యర్థాలను చెత్తబుట్టలో వేసి గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని గ్రామస్తులకు సూచించారు.

'స్టాప్ డయేరియా'ను విజయవంతం చేయండి

● డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి


వేపాడ: డయేరియాపై అవగాహన కల్పిస్తున్న డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి

వేపాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ అచ్యుతకుమారి అన్నారు. బొద్దాం పీహెచ్‌సీ, పాటూరులోని హెల్త్ వెల్‌నెస్ కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఆరోగ్య సిబ్బంది నిర్వహించిన 'స్టాప్ డయేరియా' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 0–5 సంవత్సరాలలోపు పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలని, డయేరియాపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని అన్నారు. గ్రామంలో ఎవరికైనా డయేరియా సోకితే వారికి పంపిణీ చేసేందుకు వీలుగా ఆశా కార్యకర్తలు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. చేతుల శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను చైతన్యపరచాలన్నారు. కార్యక్రమంలో డీపీహెచ్ఎన్ సత్యవతి, డాక్టర్ రమాదేవి, హెచ్ఎస్ పీఎస్ఆర్ మూర్తి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

దత్తిరాజేరు: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు దరి చేరకుండా విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని కె.కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి స్రవంతి అన్నారు. కె.కొత్తవలస ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం డయేరియా(అతిసార)నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జూలై, ఆగస్టు నెలలో అతిసార వ్యాధి ఎక్కువగా సోకే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిల్వ ఆహార పదార్థాలను తీసుకోవద్దని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వ్యాధి సోకినపుడు ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.


దత్తిరాజేరు: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ స్రవంతి

వ్యాధుల వ్యాప్తిపై సమాచారం ఇవ్వండి

● డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

గంట్యాడ: గ్రామాల్లో మలేరియా, డయేరియా, వైరల్ జ్వరాలు, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులు ప్రబలినట్లయితే వెంటనే సంబంధిత వైద్యాధికారికి సమాచారం అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. గంట్యాడ పీహెచ్‌సీని మంగళవారం సాయింత్రం ఆయన పరిశీలించారు. అనంతరం ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. 'స్టాప్ డయేరియా' కార్యక్రమంలో భాగంగా డయేరియా వ్యాప్తి, నిర్మూలన, తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆశావర్కర్లు తమ వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా పిల్లలు డయేరియా బారిన పడితే వెంటనే వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి హేమలత, ఎంపీహెచ్ఈఓలు చంద్రశేఖరరాజు, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం


గజపతినగరం రూరల్: మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

గజపతినగరం రూరల్: మానవ జాతి మనుగడకు చెట్లే జీవనాధారమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని అన్నారు. పార్టీ పిలుపుమేరకు 'అమ్మకో మొక్క' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మరుపల్లి గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు తలో మొక్కను నాటి దాన్ని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కల పెంపకంతో వాతావరణంలోని కార్బన్ డై ఆక్సైడ్ స్థాయిని తగ్గించడంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందివ్వొచ్చన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవర ఈశ్వరరావు, హరిబాబు, మండల అధ్యక్షుడు ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.


ఎస్.కోట: మొక్కలు పంపిణీ చేస్తున్న జియో వ్యవస్థాపకులు రామకృష్ణ, తదితరులు

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..

శృంగవరపుకోట: 'అమ్మ పేరుతో ఒక మొక్క నాటుదాం.. పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం' అని గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్(జియో) వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక బాపూజీ సేవా సంఘం ఆవరణలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన 'ఏక్ పేడ్ మాకే నామ్' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో బి.చంద్రశేఖర్, టి.పార్వతీదేవి, డాక్టర్ దాశరథి, స్వామినాయుడు, చిన్నికృష్ణ, బి.కృష్ణారావు యాదవ్, షణ్ముఖేష్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గ్రంథాలయం ప్రారంభం

చీపురుపల్లి: సమాజంలో ఉండే ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని వేద పండితుడు, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు దార్లపూడి మురళీకృష్ణ శర్మ అన్నారు. పట్టణానికి చెందిన ఆశయ రూరల్ లైబ్రరీ ఆధ్వర్యంలో ఉమా నీలకంఠేశ్వరస్వామి దేవస్థానంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దాతల సహకారంతో ర్యాక్‌లు, ఆధ్యాత్మిక పుస్తకాలతో గ్రంథాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ గ్రంథాలయానికి తన తరఫున వివిధ ఆధ్యాత్మిక పుస్తకాలు అందజేయనున్నట్లు చెప్పారు. ఆలయాల్లో ఇటువంటి గ్రంథాలయాలు ఏర్పాటు చేయడం ద్వారా భక్తులు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పెంచుకునేందుకు అవకాశం లభిస్తుందన్నారు. ఆలయానికి వచ్చే భక్తులు గ్రంథాలయంలో కొద్దిసేపు సమయాన్ని కేటాయించి ఇక్కడి పుస్తకాలను చదవాలని కోరారు. కార్యక్రమంలో ఆశయ రూరల్ లైబ్రరీ అధ్యక్షుడు రెడ్డి రమణ, తదితరులు పాల్గొన్నారు.


ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న మురళీకృష్ణ శర్మ

కొత్త చట్టాలపై కేంద్రం పునరాలోచన చేయాలి

దత్తిరాజేరు: ఆటో కార్మికుల పొట్టకొట్టే చట్టాలపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని సీఐటీయూ నాయకులు శ్రీనివాసనాయుడు కోరారు. స్థానిక సంతతోట వద్ద మంగళవారం ఉయదం ఆటో కార్మిక సంఘ నాయకులు అప్పలనాయుడు, ఉమామహేశ్వరరావుతో కలిసి రాస్తా రోకో నిర్వహించారు. ఇప్పటికే ఐపీసీ చట్టం ఉంటుండగా బీఎన్ఎస్ చట్టం తెరపైకి తెచ్చి జరిమానాలు, జైలు శిక్షలు కఠినంగా విధించడం సరికాదన్నారు. నరేంద్ర మోదీని మూడు సార్లు ప్రధానమంత్రిని చేసిన ప్రజలను ఇలాంటి చట్టాలు తీసుకొచ్చి ఇబ్బందులు పెట్టడం తగదన్నారు. ప్రజల నుంచి తిరుగుబాటు రాకముందే వాటిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.


సంతతోట వద్ద రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు

దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయండి

వేపాడ: దేశ వ్యాప్తంగా గురువారం నిర్వహించే విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)వేపాడ మండల కార్యదర్శి జి.కార్తీక్ కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం బంద్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తున్న పరీక్షల్లో అవకతవకల కారణంగా లక్షలాది మంది విద్యార్థులు నష్టపోతున్నారని అన్నారు. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌టీఏని రద్దు చేయాలని, పేపర్ల లీకేజ్ వల్ల నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని, నీట్ పేపర్ లీక్ నిందితులను కఠినంగా శిక్షించాలని, తదితర డిమాండ్లతో దేశ వ్యాప్తంగా బంద్ చేపడుతున్నట్లు చెప్పారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కార్తీక్, తదితరులు

నైతిక విలువలతో కూడిన విద్య అవసరం

మెరకముడిదాం: నైతికవిద్య ద్వారా మహిళలు సాధికారత సాధించాలని మౌంటాబ్ ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంకు చెందిన రాజయోగి బ్రహ్మకుమార్ భగవాన్‌భాయ్ అన్నారు. గర్భాం మోడల్ స్కూల్ విద్యార్థినిలకు మంగళవారం మహిళా సాధికారితపై ఆయన అవగాహన కల్పించారు. నైతికంగా, ఆధ్యాత్మికంగా మనల్ని మనం శక్తిమంతులుగా మలచుకోవాలని సూచించారు. ఎలాంటి పరిస్థితిలో కూడా మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం కోల్పోరాదన్నారు. నేడు పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో ప్రతి ఒక్కరూ విలువలు విస్మరిస్తున్నారని, దాని ప్రభావం సమాజంపై తీవ్రంగా పడుతోందన్నారు. ప్రతి ఒక్కరూ మన సనాతన సంప్రదాయాలకు విలువ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ ప్రొఫెసర్ బి.కె.గణేష్‌భాయ్, బి.కె.వేణుభాయ్, శ్రీనివాస్‌భాయ్, పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థినిలతో మాట్లాడుతున్న బ్రహ్మకుమార్ భగవాన్‌భాయ్

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

వేపాడ: ప్రభుత్వ పాఠశాలలో స్మార్ట్ టీవీ ద్వారా విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించాలని ఎంఈఓ–1 ఉపాధ్యాయులకు సూచించారు. కొండగంగుబూడి గిరిజన ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. స్మార్ట్ టీవీ ద్వారా చేస్తున్న బోధనను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో సాగుచేస్తున్న కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి మరిన్ని పంటలు పండించేందుకు కృషిచేయాలని సూచించారు. అలాగే ఎంఈఓ–2 బాలభాస్కరరావు సోంపురం పాఠశాలను సందర్శించి విద్యార్థులకు గుణింతాలను బోధించారు. 1,2 తరగతుల విద్యార్థులతో అభినయ గేయాలు పాడించటం, 3,4,5 తరగతుల విద్యార్థులతో తెలుగు, ఇంగ్లిష్ పాఠ్యాంశాలను చదివించడం వంటివి చేయించారు. డయేరియా, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.


సోంపురం పాఠశాలలో విద్యార్థులకు గుణింతాలు బోధిస్తున్న ఎంఈఓ-2 బాలభాస్కరరావు

నూతన చట్టాలపై అవగాహన తప్పనిసరి

బొండపల్లి: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన న్యాయ చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి అని ఎస్సై కె.లక్ష్మణరావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నూతన న్యాయ చట్టాలపై అవగాహన కల్పించేలా రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నాటి చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ) స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సీఆర్‌పీసీ) స్థానంలో భారతీయ నాగరిక సురక్ష సంహిత(బీఎన్ఎస్ఎస్), ఇండియన్ ఎవిడెన్స్ యాక్టు(ఐఏఏ) స్థానంలో భారతీయ సాక్ష్య అధినియమం(బీఎస్ఏ)గా మార్పు చేయడం జరిగిందన్నారు. ఐపీసీలో గతంలో 511 చట్టాలు ఉంటే ప్రస్తుతం 358కి తగ్గించడం జరిగిందని చెప్పారు. అలాగే సీఆర్‌పీసీలో 484 వరకు సెక్షన్‌లు ఉంటే వాటిని 531కు పెంచడం జరిగిందన్నారు. కొత్త చట్టాలు జూలై 1 నుంచి అమలులోకి వచ్చాయని, ఇకపై వాటి ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.


కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఎస్సై లక్ష్మణరావు

నేడు వాహనాల వేలం


దత్తిరాజేరు: గతంలో వివిధ కేసులలో సీజ్ చేసిన మూడు ద్విచక్ర వాహనాలను బుధవారం వేలం వేయనున్నట్లు పెదమానాపురం ఎస్సై శిరీష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ప్రభుత్వం నిర్ణయించిన ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

● గజపతినగరం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో ఓ కేసుల్లో సీజ్ చేసిన టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని బుధవారం వేలం వేయనున్నట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొని వాహనాన్ని సొంతం చేసుకోవాలని కోరారు.

రైల్వే గేట్ మూసివేత

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి రైల్వే గేట్‌ను బుధవారం రాత్రి 10 గంటల నుంచి గురువారం ఉదయం 5 గంటల వరకు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం తెలిపారు. మూడో లైన్ రైల్వే ట్రాక్ పనులు జరుగుతున్నందున గేట్‌ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే దీనిపై తహసీల్దార్, పోలీస్‌లకు సమాచారం అందించినట్లు తెలిపారు. కోమటిపల్లి గర్భాం రోడ్డు మార్గాన రాత్రి సమయంలో ప్రయాణించే వాహన చోదకులు వేరే మార్గంలో ప్రయాణాలు సాగించాలని రైల్వే అధికారులు కోరారు.

జినోసిస్ వ్యాధులపై అప్రమత్తం


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులతో వెటర్నరీ కళాశాల సిబ్బంది

చీపురుపల్లి రూరల్(గరివిడి): జంతువుల ద్వారా మనుషులకు సంక్రమించే వ్యాధుల(జినోసిస్ వ్యాధులు)పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గరివిడి పశువైద్య కళాశాల ప్రొఫెసర్స్ సుప్రియ, శివరామకృష్ణ అన్నారు. ప్రపంచ జినోసిస్ దినం సందర్భంగా పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా గరివిడి మండలం తాటిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9,10 తరగతుల విద్యార్థులకు జంతువుల ద్వారా మనుషులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పించారు. జంతువుల పెంపకం, సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి.మధుసూదన్, ఉపాధ్యాయ సిబ్బంది, పశువైద్య కళాశాల విద్యార్థులు, టెక్నీషియన్స్ బృందం పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు విరాళం

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మిస్తున్న హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయానికి పట్టణంలోని వంగపల్లిపేటకు చెందిన రేగిడి అప్పలనాయుడు, సత్యవతి దంపతులు రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ.. దాతల సహకారంతో భారీ అంచనా వ్యయంతో అయ్యప్ప దేవాలయాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. విరాళాలు అందించిన దాతలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అప్పికొండ తిఆదిబాబు, ఎస్‌వీజీ శ్రీనివాసరావు, దిలీప్‌కుమార్ ధనూకా, గురుస్వామి గుడ్ల శ్రీనివాసరావు, నాగు, తదితరులు పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న దాత అప్పలనాయుడు

జోరుగా ఉపాధిహామీ పనులు

గజపతినగరం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులు జోరుగా సాగుతున్నాయి. రైతులకు మేలు జరిగేలా సాగునీటి కాలువలు, చెరువుల్లో పూడికలు తొలగించి అభివృద్ధి చేస్తున్నారు. ఖరీఫ్‌లో సాగునీటికి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మెంటాడ మండలం ఆంధ్ర జలాశయం నుంచి సాగునీరు ఆయకట్టు శివారు భూములకు చేరేందుకు వీలుగా కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు తొలగిస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


ఎన్‌జీఆర్‌పురంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న వేతనదారులు

కొనసాగుతున్న జిందాల్ కార్మికుల నిరసన

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం సమీపంలో ఉన్న జిందాల్ స్టీల్ కర్మాగారం కార్మికులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. కంపెనీ యాజమాన్య తీరుకు నిరసనగా కార్మికులు చేపట్టిన ఈ దీక్షలు మంగళవారం నాటికి 12వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కార్మిక సంఘ జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఇప్పటికే అధికారుల సమక్షంలో కార్మిక సంఘ నాయకులు పలు దఫాలుగా చర్చలు జరిపినా కంపెనీ యాజమాన్యం తన మెండి వైఖరినే ప్రదర్శిస్తోందని వాపోయారు. 40 సంవత్సరాలుగా ఈ కర్మాగారంలో పని చేస్తున్నామని, ఇప్పుడు అర్థాంతరంగా కర్మాగారం మూసేసి రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమన్యం ఇప్పటికైనా కార్మిక కుటంబాలను దృష్టిలో పెట్టుకొని సానుకూలంగా స్పందించి కర్మాగారాన్ని తెరిపించాలని కోరారు.


కర్మాగారం గేటు వద్ద నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు ప్రణాళికలు

కొత్తవలస: ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు(టాస్క్ ఫోర్స్)తో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి ప్రజలకు సురక్షిత నీటిని సరఫరా చేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని సూచించారు. జ్వరాలు, వాంతులు, విరోచనాలతో బాధపడేవారిని గుర్తించి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణయ్య, తహసీల్దార్ చంద్రశేఖర్, కొత్తవలస, వియ్యంపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు సీతల్‌వర్మ, గోపాలకృష్ణ, ఈఓపీఆర్డీ ధర్మారావు, పీహెచ్ఎన్ రమణమ్మ, ఈఓ నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డుల జారీ


సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్

కొత్తవలస: మండలంలోని అర్హత కలిగిన కౌలు రైతులను గుర్తించి వారికి కౌలు పత్రాలు(సీసీఆర్‌సీ)ను జారీ చేయాలని తహసీల్దార్ ఎస్.చంద్రశేఖర్ ఆదేశించారు. రెవెన్యూ కార్యదర్శులు, వ్యవసాయశాఖ అధికారులతో మంగళవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో బుధవారం నుంచి కౌలు రైతు గుర్తింపు సదస్సులు నిర్వహించాలని సూచించారు. అర్హులను గుర్తించి వారికి సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలన్నారు. ఈ నెల 10వ తేదీలోగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. భూమిని కౌలుకు ఇచ్చే రైతుకు, తీసుకున్న రైతుకు సీసీఆర్‌సీ కార్డుల జారీపై అవగాహన కల్పించాలన్నారు. మండలంలో గత ఏడాది 263 మంది రైతులకు కౌలు పత్రాలను అందించామని, ఈ ఏడాది 320 మందికి కౌలు గుర్తింపు పత్రాలు జారీ చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తమటపు రమేష్, వ్యవసాయధికారి కె.మాధురీశరణ్య, ఆర్ఐ సీహెచ్.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయనగరం
9951602843
Office mail : vzmadvt@gmail.com